## మట్టి గణపతిని వాడండి.. పర్యావరణాన్ని రక్షించండి

పాలకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త



మట్టి గణపతిని వాడి పర్యావరణాన్ని పరరక్షించాలని ఈ చిన్నారుల్లో వచ్చిన చైతన్యం పలువురికి ఆదర్శమనే చెప ్పవచ్చు. వినాయకచవితిని పురస్కరించుకుని పలువురు చిన్నారులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేశారు. పాలకొండ శాఖాగ్రంధాలయ ఆవరణలో బంకమట్టితో వినాయకున్ని తయారు చేసే విధానాన్ని డ్రాయింగ్ టీచర్ మురళి చిన్నారులకు తెలియజెప్పడంతో వారు తయారీకి సిద్ధమయ్యారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలతో పర్యావరణానికి ముప్పు వుందని, మట్టి బొమ్మలను వినియోగించడం ఎంతో శ్రేయస్కరమని తయారుచేస్తున్న చిన్నారులను స్థానికి 13వ వార్డు కౌన్సిలర్ భాసూరు కాంతారావు, గ్రంధాలయాధికారి బబ్బూరు గణేష్‌బాబు, సచివాలయ అడ్మిన్ శివక్రిష్ణ, సహాయకులు ఈశ్వరరావులు విద్యార్థులను అభినందించారు.

## బావురుమంటున్న బోర్లు..పట్టించుకోని అధికార్లు

**నీటి కోసం అల్లాడుతున్న నగర పంచాయితీ వాసులు**

పాలకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త



పాలకొండ నగరపంచాయతీ పరిధిలోని పలు బోరుబావులు మరమ్మతులకు గురై మూలన పడ్డాయి. గత వారం రోజులుగా బోర్లు పనిచేయకపోవడంతో ప్రజలు నీటికోసం అల్లాడుతున్నారు. ప్రతి రోజు వచ్చే పంచాయతీ కుళాయి నీరు ఎటూ చాలక పోవడంతో తమకు దాహార్తిని తీర్చే బోర్లు కూడా మరమ్మతులకు లోనవ్వడంతో ఇక్కడి ప్రజలకు మంచినీటి కష్టాలు తప్పడం లేదు. ఇంత తెలిసినా స్థానికులు బోర్లు పాడైన విషయం నగరపంచాయతీకు, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ, గొడలగల వీధి, బుట్టి మఠం కాలనీ ఇలా పలు చోట్ల బోర్లు మరమ్మతులకు లోనైనా ఇంతవరకు పట్టించుకునే నాధులే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక బుట్టిమఠం కాలనీ వాసులు, లొడగల వీధి వాసులు నరగ పంచాయతీ కుళాయిల ద్వారా వచ్చే నీరు చాలటం లేదని తమకు నిత్యావసరమైన బోరుబావులే ప్రదానమని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజల మంచినీటి అవసరాల దృష్ట్యా ఈ బోరుబావులను బాగు చేయించి ప్రజలకు దాహార్తిని తీర్చాలని నగరపంచాయతీ కమిషనర్‌ను స్థానికులు కోరుతున్నారు.

## జిల్లా రెవెన్యూ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బుచ్చిబాబు

పాలకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త



పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నూతనే కార్యవర్గంలో పాలకొండ డివిజన్ నాయకులకు చోటు దక్కింది. ఈ మేరకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో జిల్లా రెవెన్యూ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పాలకొండ డిప్యూటీ తహశిల్దార్ బి.బుచ్చిబాబును ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా సీతంపేట తహశిల్దార్ ఎస్.నరసింహమూర్తి, ఆర్‌డిఒ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మిన్నాయుడులు ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా ఆర్‌డిఒ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌లు ఎన్నికకాబడ్డారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్‌లో పాలకొండ డివిజన్ రెవెన్యూ యంత్రాంగానికి చోటు కల్పించడంపై ఎన్‌జిఒ డివిజన్ గౌరవాధ్యక్షులు లిల్లీపుష్పనాధం, తహశిల్దార్ పి.సోమేశ్వరారవు, ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ, రెవెన్యూ డివిజన్ పాలకొండ అధ్యక్షురాలు సావిత్రి, ఆర్ఐ రమేష్, విజయ్‌గణేష్, డిప్యూటీ తహశిల్దార్ ప్రసాద్, పలువురు అభినందనలు తెలిపారు.

## నేడు కోటదుర్గ ఆలయ హుండీ లెక్కింపు

పాలకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త

పాలకొండలో వెలసియున్న ఉత్కాంధ్ర ఆరాధ్యదైవం శ్రీ కోటదుర్గమ్మ తల్లి ఆలయ హుండీ ఈనెల 29వ తేదీ సోమవారం లెక్కింపు నిర్వహించనున ్నట్టు ఆలయ ఇఒ వి.రాధాక్రిష్ణ ఆదివారం తెలిపారు. దేవాదాయ ధర్మదాయశాఖ ఆదేశాల మేరకు పాలకొండ దేవాదాయ తనిఖీదారు సమక్షంలో గ్రూపు దేవాలయాల సిబ్బందితో మాస్కులు ధరించి, సామాజిక దూరం పాటిస్తూ ఈ లెక్కింపు ప్రక్రియ వుంటుందని ఇఒ వెల్లడించారు.

## నేడు ఐటిడిఎలో స్పందన

సీతంపేట,ఆగస్టు 28ప్రభాతవార్త

స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో ప్రతీ వారం మాదిరిగానే సోమవారం స్పందన కార్యక్రమం జరగనుంది. ఐటిడిఎ పీవో బి నవ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలు పరిష్కారం కోసం గిరిజనులు వినతులు సమర్పించవొచ్చునని ఐటిడిఎ వర్గాలు తెలిపాయి.

## పర్యాటక ప్రాంతాల్లో సందడి

సీతంపేట,ఆగస్టు 28ప్రభాతవార్త



సీతంపేట మన్యం ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు ఆదివారం పోటెత్తారు. ఆదలీ వ్యూ పాయింట్,సున్నపుగెడ్డ జలపాతం, మెట్టుగూడ వాటర్‌ఫాల్స్‌తో పాటు సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వంచర్ పార్క్‌లో పర్యాటకులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతో జలపాతాల అందాలను తిలకించేందుకు పర్యాటకులు మన్యం ప్రాంతాలకు వచ్చారు.అలాగే ఎన్‌టిఆర్ అడ్వంచర్ పార్క్‌లో మహిళలు,చిన్నారులు ఉత్సాహంగా గడిపారు.పార్క్‌లో బోటింగ్,హ్యాంగింగ్ బ్రిడ్జ్,కాయకింగ్, బుల్‌రైడ్, షూటింగ్, బ్రిజడీ డిజయేటర్ వంటి సాహసోపేతమైన క్రీడల్లో చిన్నారులు,మహిళలు పాల్గొని వీకెండ్‌ను ఎంజాయ్ చేసారు.

## తిప్పనపుట్టుగలో నాడు-నేడు పనులకు భూమిపూజ

ఇచ్ఛాపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండలం ఈదుపురం పంచాయతీ తిప్పన పుట్టుగ గ్రామంలో నాడునేడు రెండవ దశ పనులకు భూమిపూజ నిర్వహించారు. 12లక్షల రూపాయలతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులకు జెడ్పీటిసి ఉప్పాడ నారాయణ మ్మ, సర్పంచ్ నర్తు వరప్రసాద్ భూమిపూజ నిర్వహించారు. వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, విఆర్వో ఉప్పాడ రాజారెడ్డి, తిప్పన దాలయ్య పాల్గొన్నారు.

## స్వేచ్ఛావతి సంబరాల నిర్వహణకు యూనియన్ల సంఘీభావం

ఇచ్ఛాపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త



గ్రామదేవత శ్రీస్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల నిర్వహణకు అన్ని యూనియన్లు సంఘీభావం తెలిపాయి. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. సంబరాల నిర్వహణ, నిధుల సమీకరణ తదితర అంశాలపై చర్చించారు. దీనిపై అన్ని యూనియన్ల ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. తమ తమ యూనియన్ల పరిధిలో ఇతర కార్యవర్గాలతో చర్చించి తమ విధానాన్ని, విరాళాలను తెలుపుతామని ప్రకటించాయి. ఆటో యూనియన్, టా ్యక్సీ యూనియన్, కిరాణా వర్తకుల యూనియన్, బంగారం వర్తకుల యూనియన్, ఇటుకల బట్టీ యూనియన్, ఇలా మున్సిపాలిటీ పరిధిలో గల అన్ని యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళకు కూరగాయలు అమ్మే బండి అందజేత

కోటబొమ్మాళి, ఆగస్టు 28 ప్రభాతవార్త



కోటబొమ్మాళికి చెందిన సదాశివ సేవా ఫౌండేషన్ ద్వారా మండలంలోని పాకివలస గ్రామానికి చెందిన నిరుపేద మహిళ పెద్దిన ప్రభావతికి కూరగాయలు అమ్మే బండిని అందజేశారు. ఈ సందర్భంగా దివంగత సదాశివ కుమారుడు సిఎ గంగారావు మాట్లాడుతూ పేదలకు తాత్కాలికంగా ఆదుకోవడం కంటే ప్రతిరోజు ఆదాయం సమకూరి కుటుంబం జీవనోపాధికి ఈ బండి సహకరిస్తుందని మా నాన్న జ్ఞాపకార్ధం మహిళకు బండి అందజేస్తున్నామని ఆయన అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ల సంఘం కోశాధికారి తాళాసు కృష్ణారావు, స్థానిక సత్యసాయి సంస్థల ప్రతినిధి అనాధిగుప్తా, సకలాబత్తుల నీలకంఠేశ్వరరావు, సకలాబత్తుల రామ్‌కుమార్, కోరాడ సాయిరాం, బోయిన సమీర్, తదితరులు పాల్గొనగా అనంతరం కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి గంగారావు కృతజ్ఞతలు తెలిపారు.

## వడ్డివాడలో జోనల్ స్థాయి క్విజ్ పోటీలు

సంతబొమ్మాళి, ఆగస్టు 28 ప్రభాతవార్త

మండలంలోని వడ్డివాడ గ్రామంలో శ్రీవరసిద్ధి వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా ఈ నెల 31న జోనల్‌స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 6 నుంచి 10 తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులని ప్రతి పాఠశాల నుంచి రెండు టీంలు రావచ్చునని అందులో పేర్కొన్నారు. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, పోలాకి, నరసన్నపేట మండలాల నుంచి విద్యార్థులు మాత్రమే ఈ పోటీలలో పాల్గొనవచ్చునని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా 5116 రూపాయలు, రెండో బహుమతిగా 3116 రూపాయలు, కన్సోలేషన్ బహుమతిగా 2116 రూపాయలు అందించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ క్విజ్ పోటీలకు సంబంధించి మిగిలిన వివరాలు కోసం 9908879413, 8247399241 నెంబర్లుకు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

కొత్తూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండలంలో జరిగే వినాయక మండపాల ఉత్సవాల నిర్వహణకు పోలీసు అనుమతులు తప్పనిసరి అని కొత్తూరు సిఐ మరియు ఎస్సై ఆర్.వేణుగోపాల్, ఎం.గోవిందలు సంయుక్తంగా తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా వినాయక ఉత్సవాల్లో మైకులు తప్ప డీజే బాక్సులకు అనుమతులు లేవన్నారు. మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరిగితే పూర్తి బాధ్యత కమిటీ సభ్యులదేనన్నారు. పోలీసు అనుమతులుకోసం వచ్చే మండప నిర్వాహకులు పంచాయతీ, విద్యుత్, అగ్నిమాపక అనుమతులతో స్టేషన్‌కు రావాలన్నారు. ధరఖాస్తులో కమిటీ సభ్యుల పేర్లు, మొబైల్ నెంబర్లు పొందుపర్చాలన్నారు. దీంతోపాటు ఉత్సవ నిర్వహణ రోజుల వివరాలు, నిమజ్జన తేదీ సమయం, వివరాలు విధిగా తెలపాలన్నారు. నిమజ్జన సమయంలో అశ్లీల పాటలతో డ్యాన్సులకు అనుమతులు లేవన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవన్నారు. గణేష్ ఉత్సవాలు ఆరోగ్య వంతమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అలాగే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉంటూ మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత నివ్వాలన్నారు.

## రోడ్డు విస్తరణ పనుల్లో తప్పని ట్రాఫిక్ కష్టాలు

**-ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్**

ఆమదాలవలస, ఆగస్టు 28 ప్రభాతవార్త



ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వెళ్లే ఎబి రోడ్డుపై జరుగుతున్న విస్తరణ పనులు వలన వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వలన ఆదివారం మధ్యాహ్నం సమయంలో నందగిరిపేట వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ట్రాఫిక్‌లో అంబులెన్స్ చికు ్కకోవడంతో ప్రయాణీకులంతా కలిసి అంబులెన్స్‌కు దారి చూపించారు. రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లు వేస్తున్నారు. ఈ బెర్మ్‌ల కోసం లారీల ద్వారా వెడ్ మిక్స్‌ను రవాణా చేసే కాంట్రాక్టర్ లారీ లోడు దిగుమతి చేయగాని నడిరోడ్డుపైనే అడ్డంగా లారీ తిప్పుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. లారీ ద్వారా వచ్చిన మిక్స్‌ను అన్‌లోడ్ చేసి చింతాడ వైపు వచ్చి లారీ తిప్పాల్సి ఉండగా అడ్డంగా రహదారిపైనే తిప్పడంతో ఈ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. దీనిపై దృష్టి సారించాల్సిన హైవే పోలీసులు పట్టించుకోకపోవడంతో మరింత ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో వాహనదారులు ఎండలో నిరీక్షిస్తున్నారు. కాంట్రాక్టర్ తప్పిదాలు వలన కష్టాలు తప్పడం లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు.

## ఈ-పోస్టు మెసెజ్‌తో అభినందన సందేశాలు

**-శ్రీకాకుళం పోస్టల్ సూపరింటెండెంట్ కాంతారావు**

వీరఘట్టం, ఆగస్టు 28 ప్రభాతవార్త



రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతులుగా ఎన్నికైన ద్రౌపది ముర్ము, జగదీష్ ధన్‌కడ్‌లకు అభినందన సందేశాలను ఈ-పోస్టు మెసెజ్‌ల ద్వారా పంపేందుకు తపాలశాఖ అవకాశం కల్పిస్తున్నట్లు శ్రీకాకుళం పోస్టల్ సూపరింటెండెంట్ ఎ.కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 ఏళ్ల అజాదీకా అమృత్ మహోత్సవం సందర్భంగా భారత రిపబ్లిక్ అత్యున్నత పదవులకు ఎన్నికైన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతులకు అభినందన సందేశాలను పంపేం దుకు సమీపంలోని తపాల కార్యాలయానికి వెళ్లి 10రూపాయలు చెల్లించాలని సూపరింటెండెంట్ తెలిపారు.

## వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్సై

వీరఘట్టం, ఆగస్టు 28 ప్రభాతవార్త



ఈ నెల 31వ తేదీ నుంచి జరగబోయే వినాయక చవితి ఉత్సవాలను అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అయితే ఈ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి అని వీరఘట్టం ఎస్సై ఎం.హరికృష్ణ ఆదివారం విలేకర్లుకు తెలిపారు. వినాయక మండపాలను ఏర్పాటు చేసేవారు ముందుగానే అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు ఎన్నిరోజులు చేస్తారు, నిమజ్జనం ఎక్కడ చేస్తారు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎవరెవరూ ఉన్నారో పూర్తి వివరాలు తమకు అందజేయాలని కోరారు. అదే విధంగా గణేష్ ఉత్సవాలు సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా విద్యుత్, అగ్నిమాపక శాఖల నుంచి ఎన్ఒసి పత్రాలు పొందాలన్నారు. ఊరేగింపు సమయంలో అశ్లీలత, అసభ్యకర కార్యక్రమాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## సీతారాంపురం గ్రామంలో ఎంపిడిఓ పరిశీలన

సంతకవిటి, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండలంలో సీతారాంపురం గ్రామంలో ఆదివారం ఎంపిడిఓ విజిట్ చేయడం జరిగింది. ఎస్‌డబ్ల్యుపిసి బిల్డింగ్‌లు ఎంతవరకు వచ్చాయో చూడడం జరిగింది. సచివాలయంలో రైతులందరికీ పంట నమోదు చేసుకోవాలని చెప్పడం జరిగింది. కంపోస్టు ఎరువులు గుంతలను చూడడం జరిగింది. ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ బిల్డింగ్‌లను చూడడం జరిగింది. ఎంపిడిఓ రఘునాధ ఆచారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖలింగేశ్వరునికి అక్షర నీరాజనం

**-స్వామి పుస్తకం ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి**

పాతపట్నం, ఆగస్టు 28 ప్రభాతవార్త



పాతపట్నం సాహితీవేత్తలు శ్రీముఖలింగేశ్వరస్వామికి అక్షర నీరాజనం అర్పించారు. ఆదివారం కాగువాడ మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేతుల మీదుగా శ్రీముఖలింగేశ్వర క్షేత్ర వైభవ పుస్తకాన్ని ఆవిష్కరింపజేశారు. మంచు చంద్రయ్య, అన్నపూర్ణమ్మ వారి ఆర్థిక సహకారంతో సాహితీ వ్యాప్త ప్రముఖ కవిపూతికి చంద్రభూషణం మాస్టర్ రచించిన చారిత్రక గేయ కావ్యం ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన ముఖలింగేశ్వరస్వామి వైభవ పుస్తకాన్ని ఆవిష్కరింపజేసిన నేను ఎంతో ధన్యురాలునని అన్నారు. అనంతరం చంద్రభూషణ్ మాస్టర్, మంచు చంద్రయ్య దంపతులకు సన్మాన సత్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మణ్‌బాబు, సాహితి వేదిక అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు, సాహితి వేదిక సభ్యులు పతివాడ దాసునాయుడు, తూలుకు తిరుపతిరావు, సాహితి వేదిక సభ్యులు, నిర్వాహకుడు డాక్టర్ జి.రాజేశ్వరరావు, మహేంద్ర డిగ్రీ కళాశాల అధినేత శాసనపురి మధుబాబు, కాగువాడ సర్పంచ్ నల్లి రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ శంకర్‌రెడ్డికి సన్మానం

సంతబొమ్మాళి, ఆగస్టు 28 ప్రభాతవార్త



అభ్యుదయ సమాజం కోసం అహర్నిశలు శ్రమించి చేతిలో కలాని జన జాగృతికి అంకితం చేస్తూ 30 వసంతాలు పూర్తి చేసుకున్న జర్నలిస్ట్ కర్రి శంకర్‌రెడ్డికి ఆదివారం ఘనంగా సన్మానించారు. రచయితల వేదిక నాలుగో వార్షికోత్సవం సందర్భంగా నరసన్నపేట శంకర్‌రెడ్డికి ఈ అభినందన పురస్కారం దక్కింది. నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ శంకర్‌రెడ్డిని శాలువతో సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. సంతబొమ్మాళి మండలం ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు శంకర్‌రెడ్డికి అభినందన పురస్కారం దక్కడంతో మండల జెడ్పీటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి మేరుగు రాజేశ్వరి అప్పారావు, వైస్ ఎంపిపి ప్రతినిధులు పొందల రామకృష్ణ, నక్క భీమారావు, కోత సతీష్, ఆదర్శ రైతు, జర్నలిస్ట్ కోత మధు, పిలక రవికుమార్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంతోష్ పాత్రికేయులు నాగేష్‌శర్మ, రామారావు, కొర్లయ్య, ప్రసాద్‌రెడ్డి, నాగిరెడ్డి, సూర్యనారాయణ అభినందనలు తెలిపారు.

## రాజాంలో బొబ్బిలి రాజుల పాలనా చిహ్నాలు

**-రాజాంకు వెలుగు దివిటీ తాండ్రపాపయ్య**

రాజాం, ఆగస్టు 28 ప్రభాతవార్త

1665లో శ్రీకాకుళం ఫాస్ దార్‌షేర్ మహమ్మద్ ఖాన్ అనుమతితో బొబ్బిలి పద్మనాయక వెలమ వంశీయులు తొలిసారిగా రాజాంలో కోట కట్టుకుని పరిపాలించారని ప్రముఖ సాహితీవేత్త గార రంగనాధం తెలిపారు. అనంతర కాలంలో పరిపాలనా సౌలభ్యం కోసం రాజాం రాజులు బొబ్బిలిలో కోట కట్టుకుని తరలిపోయారని కూడా వివరించారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలోరాజాం రచయితల వేదిక 91వ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో రాజధాని రాజాం చరిత్ర అనే అంశంపై రంగనాధం ముఖ్య ప్రసంగం చేశారు. అప్పటి రాజాం కోటలోనే బొబ్బిలి యుద్ధంలో ప్రఖ్యాతుడైన తాండ్ర పాపయ్య తన సైన్యంతో నివశించేవాడు. ఆ కోటలోనే నేటికీ కోర్టు వ్యవహారాలు నడుస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు కోర్టు పాత భవనంలోదసరానడు కోట దుర్గకు పూజలు చేసేవారని రంగనాధం తెలిపారు. గుళ్ల సీతారాంపురంలోని ఆకాశమంత ఎత్తు సీతారాముల ఆలయ గాలిగోపురం, ఈ ప్రాంతంలోని చెరువులు, నీటి పారుదల వసతులు, గ్రామ నామాలు, వ్యక్తుల పేర్లు పరిశీలిస్తే బొబ్బిలి రాజుల పాలనా ముద్రి ప్రతి అనువునా కనిపిస్తుందని చరిత్ర పరిశోధకుడైన రంగనాధం తెలిపారు. రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో తెలుగు ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ రొట్ట గణపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో చీకటి రామారావు, శాసపు రామినాయుడు, మక్క అప్పలనాయుడు, నేతేటి గణేశ్వరరావు, పెంకి చైతన్యకుమార్, బొంతు సూర్యనారాయణ, ఆల్తి మోహనరావు, పిల్లా తిరుపతిరావు, పడాల కవీశ్వరరావు, తదితరులు ప్రసంగించారు.




శ్రీకాకుళం వార్త

25 Glorious years

సోమవారం 29 ఆగస్టు 2022


## కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన చైతన్య

జలుమూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండలంలోని చల్లవానిపేటలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని యువ నాయకులు, పోలాకి జెడ్పీటిసి ధర్మాన కృష్ణచైతన్య ప్రారంభించారు. శ్రీకాకుళం కంటి వైద్య నిపుణులు దినేష్ రోగులను పరిశీలించారు. రోగులను పరిశీలించడమే కాకుండా ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. ఉచితంగా ఆపరేషన్లు కూడా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చల్లవానిపేట అధ్యక్షులు పాగోటి రాజప్పలనాయుడు, ఎంపిటిసి ప్రతినిధి విజయ్‌కుమార్, చల్లవానిపేట వైస్‌సర్పంచ్ ప్రతినిధి చిన్నాల మురళి, వాన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్సై

సంతబొమ్మాళి, ఆగస్టు 28 ప్రభాతవార్త



ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ మండపాల ఏర్పాటుకు ఉత్సవాల నిర్వహణకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సంతబొమ్మాళి ఎస్సై మధుసూదనరావు స్పష్టం చేశారు. సందర్భంగా విలేకర్లుతో ఆయన మాట్లాడుతూ ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని కోరారు. బలవంతపు చందాలు వసూలు చేయరాదని, దర్శనాలకు టిక్కెట్లు పెట్టకూడదని, అటువంటి చర్యలకు పాల్పడితే 100కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వీలైనంత వరకు కృత్రిమ రంగులు ఉపయోగించిన విగ్రహాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. మట్టితో తయారు చేసిన విగ్రహాన్ని పూజించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. విగ్రహం సైజు, ఉత్సవం ఎన్ని రోజులు నిర్వహిస్తారు, నిమజ్జనం చేసే తేదీ కమిటీ సభ్యుల వివరాలను ముందుగానే పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని తెలిపారు. ఊరేగింపు సమయంలో అశ్లీల పాటలు వేసినా, డ్యాన్సులు వేసినా, మందుగుండు సామాగ్రి కాల్చినా చర్యలు తప్పవన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సంతకవిటి, ఆగస్టు 28 ప్రభాతవార్త

మండలం గరికిపాకిపాడు గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. రాజాం నుంచి సంతకవిటి వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న వారిని సంతకవిటి నుంచి రాజాం వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ రెండు వాహనాలు తూలిగ అప్పలనర్సయ్యకు చెందిన పంట పొలాల్లో పడిపోయాయి. ఈ ఘటనలో ద్విచక్రవాహన దారుడుకి స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు గాయాలపాలైన వారిని రాజాం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులను సంప్రదిస్తే స్పందించడం లేదు.

## అచ్యుతాపురం పిహెచ్‌కి కేంద్ర బృందం

జలుమూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త

మండలంలోని అచ్యుతాపురం పిహెచ్ కేంద్రంను ఢిల్లీ బృందం పరిశీలించినట్లు వైద్యాధికారి హనుమంతు సునీత తెలిపారు. అచ్యుతాపురం పిహెచ్ కేంద్రం సుమారు స్థాపించి 15 సంవత్సరాలు అయింది కాని ఇంత వరకు కేంద్ర తనిఖీ బృందాలు పరిశీలించలేదు. మన మండలంలో సైరిగాం పిహెచ్ కేంద్రంను డిసెంబర్ 28న పరిశీలించారు. వాటి తర్వాత రెండో పిహెచ్ కేంద్రం అచ్యుతాపురంను పరిశీలించగా రోగులకు సేవలో వాటి నాణ్యతా ప్రమాణాలు, ఆసుపత్రి పరిశుభ్రత, సిబ్బంది పనితీరు, ఆసుపత్రిలో ఉండే మందులు లభ్యత, పని చేసే విధానం, డెలివరీ కేసులు అడిగి తెలుసుకున్నారు. మలేరియా, టీబీ, కలారా, లెప్రసీ మొదలగు వ్యాధులకు ఏవిధమైన నివారణ చర్యలు తీసుకుంటున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఉద్యోగి గురించి వారు పని చేసే విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క చిన్న ఉద్యోగి నుంచి డాక్టర్ వరకు అన్ని విషయాలు అడిగి తెలుసుకుని వారికి కొన్నిసూచనలు మెడికల్ బోర్డు సభ్యులు ఇచ్చారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఢిల్లీ మెడికల్ బోర్డు వారు జాతీయ ప్రమాణిక కొలతలలో అన్ని సక్రమంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. మెడికల్ బోర్డు మెంబర్లు డాక్టర్ స్నేహిత్‌కుమార్, డాక్టర్ నిహంతు ఆసుపత్రిని పరిశీలించారు. సుమారు 90 రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి ముగ్గురు నర్సులు లేనట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కొయ్యన అప్పారావు, సోమేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన కొత్తూరు సీఐ

కొత్తూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త

ఇటీవల కొత్తూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.వేణుగోపాల్ బాధ్యతలు చేపట్టిన సంగతి పాఠకులకు తెల్సిన విషయమే. ఈ మేరకు శనివారం సాయంత్రం ఆయన ఎమ్మెల్యే రెడ్డి శాంతిని పాతపట్నంలో గల క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. సిఐగా నూతన బాధ్యతలు చేపట్టిన ఆర్.వేణుగోపాల్‌కు సర్కిల్‌పరిధిలో శాంతిభద్రతలు కాపాడుతూ పారదర్శకంగా జవాబుదారీతరంతో పని చేయాలని సూచించినట్లు తెలిసింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా ప్రజలతో మమేకమై పని చేయాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కలిసిన వారిలో కొత్తూరు సిఐ వెంట పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ కూడా ఉన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం

నర్సీపట్నం, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండలంలో శెట్టిపల్లి గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే పేట ఉమాశంకర్ గణేష్ పార్టీ నాయకులు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. మూడేళ్ల కాలంలో ఆయా కుటుంబాలకు చేకూరాలని సంబంధించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేసి సంక్షేమం గురించి వివరించారు. డ్రైనేజీ వ్యవస్థ తాగునీరు సక్రమంగా సరఫరా లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీ వ్యవస్థకు నిర్మాణంకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామానికి వాటర్ ప్రాజెక్టు మంజూరు అయ్యిందని ప్రాజెక్టు పూర్తయిన వెంటనే ప్రతీ ఇంటికి కుళాయిని ఇస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీల రుణాల నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు దండిన నానాజీ పసుపులేటి రమణమ్మ రాజారావు మండల పార్టీ వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు త్వరలో సత్యనారాయణ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కన్నయ్య నాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాజంగిలో వైద్య శిబిరం

నర్సీపట్నం, ఆగస్టు 28 ప్రభాతవార్త



ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా అనేక ప్రాణాంతక రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జల్లిహలియా రాణి అన్నారు. జిమ్స్ గ్రేస్ ఇండోర్‌మెంట్ వారి ఆధ్వర్యంలో మండలంలోని తాజంగి పంచాయితీ కప్పల కోరుకొండ గ్రామాల్లో డా.సంజీవరావు నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో వైద్యం అందేలా తమ వంతు సహకారాన్ని అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం వైద్య విషయంలో ముందుందని ప్రజల శ్రేయస్సు ఆరోగ్య విషయంలో వైద్యులను సిబ్బందిని అప్రమత్తం చేసిందన్నారు. రహదారులు ఉన్న ప్రతీ చోటకి అంబులెన్స్‌లు నేరుగా వచ్చి రోగులకు వైద్య శాలలకు తరలించడం జరుగుతుందన్నారు. ఉచిత వద్యై శిబిరాలను ప్రజలు పూర్తిగా సద్వినియోగ పరచుకున్నారు. సంస్థ సూపర్ వైజర్ ఎం.జోసఫ్, అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, వ్యవసాయ కమిటీ డైరెక్టర్ సంసోన్ పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగ్‌కి అలవాటు పడుతున్న యువత

యలమంచిలి, ఆగస్టు 28 ప్రభాతవార్త

క్రికెట్ బెట్టింగ్‌కి అలవాటు పడుతున్న యువత యలమంచిలి పట్టణంలో ఈ మధ్యకాలంలో క్రికెట్ బెట్టింగ్ మోజులో పడి యువత వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. క్రికెట్ బెట్టింగ్‌లో భారీ మొత్తంలో డబ్బును కోల్పోయి చాలామంది అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. చాలామంది యువత చేతిలో ఫోన్ వాడకం ఎక్కువగా ఉండడంతో అంతా ఆన్‌లైన్లోనే జరిగిపోతుంది బయట ప్రపంచానికి తెలియకపోవడం ముఖ్యంగా క్రికెట్ సీజన్ స్టార్ట్ అయితే బెట్టింగ్ హడావుడి మొదలవుతుంది. యువత తల్లిదండ్రులకు తెలియకుండా అప్పులు చేసి దీనికి బలవుతున్నారు. దీనిపై పోలీసులు దృష్టి పెట్టాని పలువురు కోరుతున్నారు.

విజయనగరం వార్త
25 Glorious years
సోమవారం, 29 ఆగస్టు 2022

## ప్రజాసేవలో సర్పంచ్ ఇజ్జాడ



పాచిపెంట, ఆగస్టు 28 ప్రభాతవార్త

సర్పంచ్ పదవీ బాద్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజల సమస్యలు తెలుసుకుని సమస్యలు పరిష్కరించే దిశగా ప్రజాసేవ ధ్యేయంగా కోటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పల నాయుడు దూసుకెళు తున్నారు. కోటికిపెంట పంచాయతీ పరిధిలో కోడి కాలువలస, గరేళ్ళవలస, గోగాడ వలస, కోటికిపెంట, కొత్తపేట తదితర గ్రామాల్లో ప్రజాసమస్యల పట్ల దృష్టిసారించి పింఛన్లు, వీధిలైట్లు అంధాకారంలో ఉన్న వీధుల్లో నూతన విద్యుత్ స్తంబాలు స్మశాన వాటిక రహదారి, పాఠశాల ప్రహారీగోడలు అనేక సమస్యలు పదవి చేపట్టిన ఏడాదిలో చేసిన ఘనత యువ సర్పంచ్‌కు దక్కిందని గరేళ్ళవలస, గోగాడవలస, కోడికాలవలస గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్ పదవి బాద్యతలు చేపట్టిన అనతికాలంలో సమస్యల పట్ల శ్రద్ధ చూపించి సంబందిత అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి నాంది పలికిన ఏకైక సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు అని గరెల్లవలస గిరిజన యువకులు కొనియాడారు. గురువారం గరిల్లవలస గ్రామంలో శివారున గల కాలనీలో విద్యుత్ స్తంబాలు లేక దశాబ్దకాలం నుంచి అంధాకారంలో జీవనం గడుపుతున్న గిరిజన కుటుంబాలకు ఇంటి ముందు ఏడు విద్యుత్ స్తంభాలు నిర్మాణంచ ఏపట్టి విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు.

## అటవీశాఖ కాటేజీల మరమ్మతుల పనుల్లో అవకతవకలు

శృంగవరపుకోట, ఆగస్టు 28 ప్రభాతవార్త



జిల్లాలోని అటవీశాఖకు సంబందించి తాటిపూడి పరిధిలోని నక్కలవలస గ్రామ సమీపంలో గంటికొండ రిజర్వ్‌ఫారెస్టు ఆనుకుని ఏర్పాటు చేసిన కాటేజీల మరమ్మతుల పనులలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏడాది క్రితం కాటేజీల మరమ్మతులు కోసం సుమారు కోటి రూపాయలకు పైగా సంబందిత అధికారులు అంచనా వేసి నిధులు మంజూరు చేశారు. కాటేజీలలో మొత్తం పదిరూమ్‌లు ఉన్నాయి. ఒక్కొక్క రూమ్‌లో ఒక ఏసి, సోఫా, డబుల్‌కట్ మంచం, పరుపు, కుర్చీలు-4, ఫ్యాన్, కిటికీలు, తలుపులు, టైల్స్, పెయింటింగ్ తదితర పనులు చేపట్టారు ఇలా పది రూమ్‌లలో ఏర్పాటు చేశారు. అలాగే డైనింగ్ హాల్‌లలో కూడా టేబుల్స్, కుర్చీలు, టైల్స్, ఫ్యాన్లు తదితర సామాగ్రిని ఏర్పాటు చేశారు. ఇంకా కొత్తగా బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేసి టైల్స్‌తో పాటు కొత్త సామా గ్రిని ఏర్పాటు చేశారు. అలాగే రూమ్‌లు పైన కొత్తగా రేకులు ఏర్పాటు చేశారు. ఇంకా మెట్లు మార్గంలో కూడా టైల్స్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం మీద మరమ్మతులు పేరిట కొత్త రంగులు, హంగులతో కాటేజీలు ఇప్పుడిప్పుడే నిర్మాణాలు చేపట్టినట్లు కనిపిస్తున్నప్పటికీ పైన పటారం, లోన లోటారం అన్నట్లుగా ఉందని అప్పుడే విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. ఇటు మరమ్మతులు పనులలో నాణ్యత లేదని అలాగే అటు ఫర్నిచర్ తదితర సామాగ్రి ఏర్పాటు చేయడంలో రెండోరకం (సెకెండ్ క్వాలిటీ) కొనుగోలు చేసినట్లు సమాచారం. కాటేజీల మరమ్మతులలో ఎటు చూసినా పూర్తిస్థాయిలో నాణ్యత లేదని తెలుస్తోంది. పనులలో నాణ్యత లేదని అతా రెండో రకం మరమ్మతుల పనులే జరిగాయని సంబందిత కాటేజీల సిబ్బందికి తెలిసినప్పటికీ సంబందిత అధికారులకు ఎదురు చెప్పే అవకాశం లేకపోవడంతో చాపకింద నీరులాగ మరమ్మతుల పనులు సాఫీగా సాగిపోయాయి. సుమారు కోటి రూపాయలకు పైగా జరిగిన కాటేజీల మరమ్మతుల పనులలో భారీగా స్కాం జరిగినట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం అప్పటి ఎస్.కోట అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి గంగరాజు ఆద్వర్యంలో కాటేజీ మరమ్మతుల పనులన్నీ జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రేంజర్ ప్రమోషన్‌పై ఆయన బదిలీపై వెళ్ళి పోయారు. ఈ విషయమై ప్రస్తుతం డివిజనల్ అటవీరేంజ్ అదికారి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్ళగా ఇటీవల నేను బదలీపై వచ్చానని అయితే కాటేజీల మరమ్మతులకు సంబందించి అప్పుడే బిల్లులు చెల్లింపులు జరిగిపోయాయన్నారు. ఏదిఏమైనా కాటేజీల మరమ్మతుల పేరిట జరిగిన పనులలో భారీగా అ్కమాలు చోటుచేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరి సంబందిత ఉన్నతాధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

## అనుమతులు తప్పనిసరి



కొత్తవలస, ఆగస్టు 28 ప్రభాతవార్త

గణేష్ మండపాల ఏర్పాటుకు ఆయా గ్రామాల నిర్వాహకుల కమిటీ సభ్యులు సంబందించి పోలీస్‌స్టేషన్ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలు జారీ చేశారని కొత్తవలస సి.ఐ బాలసూర్యారావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాలు నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహక కమిటీసభ్యులు అన్ని ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిబందనలు పాటించాలని పోలీస్‌శాఖకు సహకరించాలని కోరారు. ఉత్సవాల నిర్వహణకు సంబందిత నిర్వాహక కమిటీదే పూర్తి బాద్యత వహించాలని, బలవంతంగా వసూలు చందాలకు పాల్పడటం ఎవరైనా చేస్తే అటువంటి వారిపై డయల్ వందకు సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో బాగంగా మట్టితో చేసిన విగ్రహాలనే వినియోగించాలని కోరారు. ఏర్పాటు చేసి ప్రదేశం, ప్రతిమ ఎత్తు, బరువు ఉత్సవం ఎన్ని రోజులు నిర్వహిస్తున్నది, నిమజ్జనం చేసే తేదీ, సమయం, ఊరేగింపు వెళ్ళే మార్గంపై పోలీసులకు ముందుగా తెలియజేయాలని ఆయన కోరారు.

## విద్యార్థి అదృశ్యం. పోలీసులకు తండ్రి ఫిర్యాదు

గరివిడి, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండలంలోని వెదుళ్ళవలస గ్రామానికి చెందిన బర్నాల అజయ్ అనే విద్యార్థి అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు అజయ్ తండ్రి సన్యాసి నాయుడు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. బిల్లలవలస ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థి అజయ్ ఈ నెల 26న పాఠశాలకు వెళ్ళి ఇంటికి రాక పోవడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు అన్ని చోట్ల గాలించినా ఫలితం లేకపోవ డంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎ.ఎస్.ఐ ఎం.వి.రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం



కురుపాం, ఆగస్టు 28 ప్రభాతవార్త

మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఎంపిక కురుపాంలోని ఆది వారం జరిగింది. గౌరవాద్యక్షులుగా కోదంగొల్లు మజ్జి గౌరీ శంకరరావును అద్యక్షులుగా ఆగూరి రామారావు, ఉపాద్యక్షులుగా పి.కుమారస్వామి, ఎ.చిరంజీవి, కార్యదర్శిగా కె.అశోక్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా కె.గంగాధర్, కోశాధికారిగా కె.జగన్నాథంతో పాటు పంది మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## జిసిసి మేనేజర్ శ్రీరాములు మృతి



గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త

గుమ్మలక్ష్మీపురం జిసిసి బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న కె.శ్రీరాములు అకాల మృతి చెందారు. ఆయనకు గత రెండు రోజులుగా జ్వరం రావడంతో పార్వతీపురం ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించి వైద్య సహాయం అందించారు. అయినప్పటికీ శ్రీరాములు ఆదివారం ఉదయం అకాల మృతి చెందారు. మృతుడు శ్రీరాములది జియ్యమ్మవలస మండలం బొడ్డవలస స్వగ్రామం మృతుడికి బార్య, ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. మృతుడు శ్రీరాములు గతంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో డి.ఆర్.డి.ఒ సేల్స్‌మేన్‌గా పని చేశారు. అనంతరం ఆయన అన్ని నిధులు నిర్వహిస్తూ బ్రాంచ్ మేనేజర్ స్థాయికి ఎదిగారు. ఇటీవల పాతపట్నం బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తూ గుమ్మలక్ష్మీపురం జి.సి.సి బ్రాంచ్ మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. మృతుడు శ్రీరాములు నిరాడంబరుడు సౌమ్యుడిగా మంచిపేరు తెచ్చుకున్నారు. మృతుడు శ్రీరాములు ఆకస్మిక మరణంతో జిసిసి ఉద్యోగ వర్గాల్లో స్నేహితులు, బందువులు జీర్ణించుకోలేకపోతున్నారు.

## పెరిగిన అధికారుల ఒత్తిడి

విజయనగరం, ఆగస్టు 28 ప్రభాతవార్త



విజయనగరం జిల్లాలో మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు సర్వేయర్లపై అధికారులు వత్తిడి పెరిగిందని ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అద్యక్షుడు చౌదరి వెంకటరావు అన్నారు. నగరంలో రెవెన్యూహోం లో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై పలువురు సర్వేయర్లు ఏకరువు పెట్టారు. అధికారుల ఒత్తిడి తీవ్రంగా ఉండటం వల్ల మానసికంగా, ఆరోగ్యంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రులు, పగలు సర్వేపనులు చేయించుకుంటున్నారని, ప్రశ్నించిన వారికి మెమోలు జారీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్థిష్టమైన సమయపాలన లేకుండా ప్రభుత్వ శెలవు దినాల్లో కూడా పనులు చేయించుకుంటున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో నిర్దేశించిన స్టాండింగ్ ఆపరేషన్ ప్రోసీజర్ ప్రకారం చేయాల్సిన పనులను కేవలం గ్రామ సర్వేయర్లతో బలవంతంగా చేయిస్తున్నారని, ప్రతీ టీమ్‌లో ఉన్న మిగతా విఆర్ఒ, విఆర్ఎలను కూడా గ్రామ సర్వేయర్లతో చేయిస్తున్నారని వారు తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అద్యక్షుడు వెంకటరావు మాట్లాడుతూ గ్రామ సర్వేయర్లు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ సమావేశంలో 27 మండలాలకు చెందిన మండల, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## వైకాపా ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం : డిప్యూటీ సిఎం



సాలూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త

ప్రజల కోసం ప్రజలతో ఎన్నుకోబడిన వైఎస్సార్ ప్రభుత్వంలో కులమతం బేదం లేకుండా అందరికీ న్యాయం చేసి ఒక్క సిఎం జగన్మోహన్‌రెడ్డి అని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఆదివారం మండలంలో మరిపల్లి గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం వైసిపి శ్రేణులతో కలియదిరుగుతూ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. వైఎస్సార్ ప్రభుత్వం అంటే ప్రజల ప్రభుత్వం అని ఎప్పటికీ ప్రజలకు అండగా ఉంటుందని పేదల సంక్షేమమే పరమావదిగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రతి పేదవాడు సొంత ఇంటి కల నెరవేర్చేకునేందుకు సిఎం జగన్ ఇల్లు పట్టాలు పంపిణీ చేశారని నిర్మాణం జరిపి సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని కోరారు. వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైకాపా జిల్లా నాయకులు దండి శ్రీనివాసరావు, ఎ.ఎం.సి చైర్మన్ అనంతకుమారి, వైకాపా మండల నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## విద్య, వైద్యానికి పెద్దపీఠ : ఎంపి బెల్లా, ఎమ్మెల్యే బొత్స

గజపతినగరం, ఆగస్టు 28 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ పెద్దపీట వేస్తోందని విజయనగరం పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అప్పలనర్సయ్య అన్నారు. స్థానిక కళాశాల బాలికల వసతి గృహానికి అవసరమైన వంట సామాగ్రి, పర్నిచర్, పరుపులను ఎనిమిది లక్షల ఎంపి ల్యాడ్స్ నిధుల నుంచి మంజూరు చేశారు. ఈ సందర్భంగా వాటిని వసతి గృహ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సమావేశంలో వారు మాట్లాడుతూ, గతానికి బిన్నంగా ఇప్పుడు పాఠశాలలు, వసతి గృహాలు తయారయ్యాయన్నారు. నాడు-నేడుతో పాఠశాలల స్వరూపమే మారిపోయిందన్నారు. 3,4,5 తరగతులు విలీనం, ఇంగ్లీషు మీడియంతో విద్యావిదానంలో సమూల మార్పులు రానున్నాయన్నారు. నూతన విద్యావిదానంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విద్యలో ఇప్పుడు మన రాష్ట్రం కేరళతో పాటు పోటీ పడుతుందన్నారు. విద్యలో ఎప్పుడూ వెనుకబడి ఉండే విజయనగరం, గత ఏడాది పది పరీక్షల్లో మూడో స్థానంలో నిలవడం ఆనందాయకమన్నారు. జిల్లాలో 17 కళాశాలలకు నాడు-నేడు కింద 250 కోట్లు మంజూరయ్యాయన్నారు. గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 70 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల స్థాయి నుంచి వంద పడకల స్థాయికి తీసుకెళ్ళామన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిని పెంచి ఇద్దరి వైద్యులను నియమించామన్నారు. ఈ వసతి గృహానికి ఆర్ఒ ప్లాంట్ మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, ఎఎంసి చైర్మన్ ముత్యాల నాయుడు, ఎపిసి స్వామినాయుడు, జడ్పీటీసీ గారతవుడు, ఎంపిపి జ్ఞానదీపిక పాల్గొన్నారు.

## ఉత్సాహంగా బాడ్మింటన్ పోటీలు



విజయనగరం, ఆగస్టు 28 ప్రభాతవార్త

విజయనగరం సిటీ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు ఆదివారం నిర్వహించిన పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా కొనసాగాయి. అరవైనాలుగు మంది షటిల్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. షటిల్ బాడ్మింటన్ పోటీలను అసోసియేషన్ అద్యక్షులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు, కార్యదర్శి సురేష్, అతీయ క్రీడాకారులు మలికార్జున్, అశోక్ ప్రారంభించారు. ఫైనల్స్‌లో కుటుంబారావు తేజ టీం రాఘవరెడ్డి ఉదయ్ టీంపై విజయం సాధించింది. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చేతుల మీదుగా బహుమతులు విజేతలకు అసోసియేషన్ అందజేయడం జరిగింది.

## ప్రజలపై భారాలు వేసే చెత్త పన్ను రద్దు చేయాలి

విజయనగరం, ఆగస్టు 28 ప్రభాతవార్త



ప్రజలపై భారాలు వేసే చెత్తపన్నును రద్దు చేయాలని కోరుతూ విజయనగరం పట్టణం పౌర సంక్షేమ సంఘం పిలుపులో భాగంగా ఆదివారం కనపాక 46వ వార్డు పరిధిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర అద్యక్షుడు కంది త్రినాత్, ఐద్వా జిల్లా అద్యక్షులు పి.రమణమ్మ, సిఐటియు నగర అద్యక్షులు బి.రమణలు మాట్లాడుతూ సాయి అమృత రెసిడెన్సి అయ్యప్ప అపార్ట్‌మెంటు ప్రజలపై చెత్తపన్ను కట్టలేదన్న నెపంతో మున్సిపల్ అదికారులు బౌతికంగా దాడి చేశారన్నారు. దీనిని విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని దాడి చేసిన మున్సిపల్ అధికారులు బాలకృష్ణ, మణికంఠలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తక్షణమే నగరంలో చెత్తపన్ను వసూళ్ళను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వైసిపి పాలన ఇదే రీతిలో కొనసాగితే ప్రజలు తిరగబడతారన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద అప్పుకోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పట్టణ సంస్కరణలు అమలు వలన రాష్ట్ర ప్రజలపై చెత్తపన్ను నెలకు 60 రూపాయలు, 90 రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారని రాజ్యాంగ విరుద్దంగా ఉన్న ఈ విదానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. చెత్తపన్నుకి ఎలాంటి చట్టబద్దత లేకపోయినప్పటికీ అధికారులు అప్రజస్వామికంగా ప్రజలు, వృద్దులు, వితంతు, వికలాంగుల పింఛన్‌లో కోత విధించడం దుర్మార్గమన్నారు. ఒకపక్క అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని నవరత్నాలు ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ప్రజలపై భారం మోపెలా చెత్తపన్నును వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలను ఎంతగానో ఇబ్బందికి గురి చేస్తున్న ఈ చెత్త పన్నును తక్షణమే రద్దు చేయాలని లేనిపక్షంలో తమ పోరాటం ఉదృతం చేస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు రైతు మృతి

శృంగవరపుకోట, ఆగస్టు 28 ప్రభాతవార్త

ఎస్.కోట మండలం పోతనాపల్లి గ్రామంలో పిడుగుపాటుకు రైతు కూనిరెడ్డి నరసింహనాయుడు (45) అనే రైతు మృతి చెందగా భార్య పద్మ తీవ్ర గాయాలతో ఎస్‌కోట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషాద ఘటనకు సంబందించి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, గ్రామపెద్దలు కొటకల రాంబాబు, కూనిరెడ్డి రాముడు, తదితరులు తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం మద్యాహ్నం గ్రామంలో గల కుమ్మరి పొలంలో భార్యభర్తలు ఇద్దరూ కలుపు తీసే పనిలో ఉండగా 3.30 గంటల సమయంలో వర్షంతో పాటు పెద్ద శబ్దంతో పిడుగులు పడ్డాయని, ఒక పిడుగు నేరుగా రైతు నరసింహనాయుడుపై పడటంతో కాలిన గాయాలకు గురై మృతి చెందాడని, కొద్ది అడుగుల దూరంలో ఉన్న బార్య పద్మ తీవ్రంగా గాయపడిందని చెప్పారు. మృతునికి ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'సెంచూరియన్' కోర్సుల్లో చేరితే డబుల్ ధమాకా

### ఇంజినీరింగ్‌లో డ్యూయల్ డిగ్రీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు వెల్లడి



నెల్లిమర్ల, ఆగస్టు 28 ప్రభాతవార్త

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్దులకు ఇంజనీరింగ్ రెగ్యులర్ కోర్సుతో పాటు నైపుణ్యంలో 8 రకాల శిక్షణలు ఇస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు చెప్పారు. తన చాంబర్‌లో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది నుంచి ఇంటిగ్రేటెడ్ ఎంఎస్ కోర్సుల్లో చేరిన వారికి ఆస్ట్రేలియాలోని సిడ్నీ యూనివర్సిటీ నుంచి డ్యూయల్ డిగ్రీ అందజేస్తామని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్దులకు ప్రతి సెమిస్టర్ కు ఒక స్కిల్ కోర్సు తప్పనిసరి చేశామని వివరించారు. ఆ విధంగా విద్యార్దులకు ఇష్టమైన 8 రకాల నైపుణ్య కోర్సులు నేర్చుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం ఇక్కడ 150 రకాల నైపుణ్య కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇంజినీరింగ్‌కు సంబంధించి కంప్యూటర్ సైన్స్‌లో 7 స్పెషలైజేషన్స్, మెకానికల్ విభాగంలో 3, ఎలక్ట్రికల్ విభాగంలో 3 ప్రత్యేక కోర్సులు నిర్వహిస్తున్నామని అన్నారు.బిఎస్‌సిలో ఆప్టోమెట్రీ, రేడియాలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ, అనస్థీషియా అండ్ ఆపరేషన్ థియేటర్, ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులతో పాటు బిబిఎ కోర్సులు అందుబాటులో ఉన్నాయని అన్నారు.

## పూతికపేటలో నేటి నుంచి 'ఇంటింటా ధ్యానం' కార్యక్రమం

నెల్లిమర్ల, ఆగస్టు 28 ప్రభాతవార్త



పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో మండలం లోని పూతికపేట గ్రామంలో ఈ నెల 29 నుంచి ఇంటింటా ధ్యానం కార్యక్రమం చేపట్టనున్నట్లు పిరమిడ్ మాస్టర్ మొయిద ప్రకాశరావు చెప్పారు. నెల్లిమర్లలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. బ్రహ్మర్షి పత్రీజీ దివ్య ఆశీస్సులతో విజయనగరం జిల్లా పిరమిడ్ మాస్టర్ల సహకారంతో పూతికపేటలో పిరమిడ్ మాస్టర్‌లు శ్రీనివాస్, ధనుంజయ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. నేటి యాంత్రిక ప్రపంచంలో ప్రతి ఒక్కరు ధ్యానం తప్పనిసరిగా చేయాలని అన్నారు. ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం కూడా లభిస్తుందని అన్నారు. మండలంలో ఏ గ్రామంలో అయినా గ్రామస్తులు కోరితే తాము ఉచితంగా ధ్యాన శిక్షణను ఇవ్వడానికి సిద్దంగా ఉన్నామని ప్రకాశరావు స్పష్టం చేశారు

## పులి సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

### త్వరలోనే పులిని పట్టుకుంటాం -విశాఖ అటవీ ముఖ్య సంరక్షణాధికారి రామ్మోహనరావు

విజయనగరం కలెక్టరేట్,ఆగస్టు 28 ప్రభాతవార్త



జిల్లాలో పులి సంచారం చేస్తున్న ప్రాంతాలలో విశాఖపట్నం ముఖ్య అటవీ సంరక్షణాధికారి పి.రామ్మోహనరావు ఆదివారం విస్తృతంగా పర్యటించారు. పులిగుమ్మి పరిసర ప్రాంతాలు, షికారుగంజి రిజర్వు అటవీప్రాంతం తదితర ప్రాంతాలలో ఆయన అటవీ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో ఉన్న ప్రజలతో మాట్లాడుతూ పులులు స్వతాహాగా బిడియ స్వభావం కలవి అని మనుషులకు సాధ్యమైనంత దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ వారికి కనబడకుండా ఉండేందుకు ఇష్టపడతాయన్నారు. అకస్మాత్తుగా మన ఉనికిని గ్రహించనట్లైతే పులి దాడి అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఆరుబయట నిద్రించడం,సంచారంలేని ప్రదేశాలలో ఒంటరిగా తిరగడం చేయరాదని, ముఖ్యంగా రాత్రి వేళ,తెల్లవారు జామున సంచరించే అవకాశం ఎక్కువగా ఉన్నందున,నాలుగు కాళ్లపై నిలబడే జంతువులను ఆహారంగా భావించడం జరుగుతుందన్నార. కనుక బహిరంగ ప్రదేశాలలో కూర్చుని మల విసర్జన చేయడం ప్రమాదకరమన్నారు. సాధ్యమైనంత వరకు పులి తిరిగి తన ఆవాసాలకు చేరుకునే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జా గ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవలి కాలంలో రెండు ఆవులను చంపడం జరిగిందని వాటి బాధితులకు రూ.35వేలను నష్ట పరిహారం కింద గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య,ముఖ్య అటవీ సంరక్షణాధికారి,విజయనగరం జిల్లా అటవీ అధికారి ద్వారా చెక్కు రూపంలో అందజేసారు. అలాగే ఉత్తరప్రదేశ్ నుండి రప్పించిన పులి బోనును, వైల్డ్‌లైఫ్ రెస్క్యూ వేవ్ అందుబాటులో ఉంచేందుకు విజయనగరం రప్పించడం జరిగిందన్నారు. సాధ్యమైనంత త్వరలో పులికి సంబంధించి ఒక పరిష్కారం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తోడ్పడాలి

### నగర పంచాయితీ వైస్‌చైర్మన్ రామారావు



నెల్లిమర్ల, ఆగస్టు 28 ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తోడ్పడాలని నగర పంచాయితీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. శ్రీరామకృష్ణ సేవా సమితి నెల్లిమర్ల మండల శాఖ ఆధ్వర్యంలో నెల్లిమర్ల, జరజాపుపేట, తూర్పు మహారాజుపేట (కొండపేట) ప్రాంతాల్లో ఆదివారం 3000 మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరిగింది.జరజాపుపేటలో జరిగిన కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధి టి.జగన్నాధరాజు తో కలిసి వైస్ చైర్మన్ రామారావు పాల్గొని విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రసాయనాలతో తయారుచేసిన విగ్రహాల వల్ల దుష్ఫలితాలు ఉన్నాయని అన్నారు. ఆ విగ్రహాలను చెరువుల్లోనూ, నదుల్లోనూ నిమజ్జనం చేసినపుడు నీటిలో ఉండే చేపల సంపదకు, జీవులకు తీరని నష్టం జరుగుతున్నదని అన్నారు. మట్టి విగ్రహాలను వినియోగించడం వల్ల పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జగన్నాధరాజుతో పాటు సత్యజ్ఞానానంద ఆశ్రమ పీఠాధిపతి విద్యానంద భారతిస్వామి, నాగవంశ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిల వాసు, ఎంసి డైరెక్టర్ పోలుబోతు నారాయణమూర్తి,సిపిఐ నాయకుడు తాలాడ సన్నిబాబు,ఉపాధ్యాయులు మద్దిల సన్యాసిరావు,కడలి సత్యసాయిగణేష్,తాలాడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై పోలీస్ పికెట్ ఏర్పాటు

యలమంచిలి, ఆగస్టు 28 ప్రభాతవార్త



యలమంచిలి పట్టణంలో రైల్వేస్టేషన్, బస్ కాంప్లెక్స్ జాతీయ రహదారిపై పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సిపి ఎస్ ఉద్యోగులు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి ఉద్యోగస్తులు ఎవరూ పాల్గొనకుండా ఉండేందుకు పోలీస్ శాఖ విస్తృతమైన ఏర్పాట్లను చేసింది. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్, బస్ కాంప్లెక్స్, జాతీయ రహదారిపై పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఉద్యోగస్తులు ఎవరిని విజయవాడ కార్యమ్రానికి వెళ్లకుండా ముందస్తుగా అరెస్టు చేస్తున్నారు. ఈక్రమంలో భాగంగా స్థానికంగా యలమంచిలి పట్టణ ఎస్ఐ అమన్‌రావు తనిఖీలను చేపట్టారు. పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్ పికెట్, ఉద్యోగస్తులను ఎవరిని సమ్మెలో పాల్గొనకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు.

## ఘంటసాల కల్చర్ సంఘం సమావేశం



యలమంచిలి, ఆగస్టు 28 ప్రభాతవార్త

యలమంచిలి పట్టణంలో ఘంటసాల కల్చర్ సంఘం సమావేశం ఆదివారం స్థానిక లైబ్రరీ హాల్‌లో ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ముఖ్య గౌరవాధ్యక్షులుగా ఎంపీపీ బొద్దపు గోవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవింద మాట్లాడుతూ ఘంటసాల కల్చర్ అసోసియేషన్ మంచి కార్యక్రమాలు చేయాలని, అసోసియేషన్ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. గతంలో చర్చించిన అంశాలు, కొత్తగా చేయబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ జగన్నాథం, అసోసియేషన్ సభ్యులు ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

## మన్‌కీ బాత్ కార్యక్రమంను వీక్షించిన బీజెపి నాయకులు

గాజువాక, ఆగష్టు28, ప్రభాతవార్త



గాజువాక బీజెపి కార్యాలయంలో గాజువాక బీజెపి కన్వీనర కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించారు. ఈ సందర్భంగా కెఎన్‌ఆర్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ 88వ ఎపిసోడ్ ద్వారా దేశ ప్రజలును ఉద్దేశ్చిఇ ప్రసంగిస్తూ గత కొన్ని సంవత్సరాలుగా బీఎంఐఎం, యూపీఐలు మన ఆర్థిక వ్యవస్థ అలవాట్లులో ఒక భాగం అయింది అని చిన్న చిన్న పట్టణాలు, గ్రామాలులో కూడా యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయని డిజిటల్ ఎకనామీ వల్ల దేశంలో ఒక కొత్త సంస్కృతిక పుట్టుకొస్తుందని అన్నారు. రేపు జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని మేజర్ ద్యాన్‌చంద్‌కి నివాళులర్పించాలని, టోక్యో ఒలింపిక్స్‌లో మన వికలాంగ సోదరులు, సోదరీమణులు వాళ్ల సత్తా చాటారు అని వికలాంగులను వనరులు మౌలిక సదుపాయాలును అందుబాటులోకి తీసుకొని రావడానికి దేశం నిరంతరం కృషి చేస్తుందని ప్రధాని అన్నారని అలాగే దేశంలో చిరుధాన్యాలు పండించే రైతులు దగ్గరపంటలను ప్రజలు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని ప్రధాని పిలుపునిచ్చారని కెఎన్‌ఆర్ వివరించారు. కార్యక్రమంలో రాజశేఖర్, నాయుడు, జ్యోతి, సాహితి, ఈశ్వరమ్మ, చుట్టూ పక్కన ఉన్న గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన సత్తెమ్మతల్లి పండుగ



గాజువాక, ఆగష్టు28, ప్రభాతవార్త.

రాజీవ్‌మార్గం శ్రీశ్రీశ్రీ సత్తెమ్మతల్లి ప్రధాన పండుగ ముగించుకొని మారువారం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అతిథులు చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులుగ ఆమట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు తల్లి సత్తెమ్మతల్లి అని అన్నారు. గత 28ఏళ్లగా ఆలయ కమిటీ సభ్యులు ఎంతో ఘనంగా ఈ పండగను నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో గోన శ్రీనివాసరావు, దొడ్డి రమణ, మద్దాల అప్పారావు, పెంటకోట వెంకట సత్యనారాయణ, సూరిశెట్టి శివ, కాండ్రేగుల హరినాధ్, భీశెట్టి సింహాచలం నాయుడు, మల్ల నర్సింగరావు, ఆదినారాయణ, వెంకటరమణ, జోగ అప్పారావు, అప్పలనాయుడు, కొయిలాడ పెద్ద అప్పారావు, రమణాజీ, సత్తిబాబు, కాండ్రేగుల శివ, కోరుకొండ మంగ, మహిళ కోలాట సభ్యులు, గాజువాక వార్డు పురప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అపార్టుమెంటు వాసులకు అవగాహన సదస్సు

గాజువాక, ఆగష్టు28, ప్రభాతవార

జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలో దువ్వాడ పోలీసులు ఇంటింటికి వెళ్లి ట్రాఫిక్ నిబంధనలు పై ఆదివారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయి అపార్టుమెంటువాసులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలును పాటిస్తే తమ పైనే ఆధారపడి ఉన్నవారిని అన్యాయం చేయకుండా ఉంటామని చెప్పారు. రూల్స్ అతిక్రమించితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, అపార్టుమెంటువాసులు పాల్గొన్నారు

